క్లుప్తంగా

దుర్గమ్మ ఆశీస్సులు అందరిపై ఉండాలి


ఆనం విజయకుమార్‌రెడ్డి


పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: విజయదశమి సందర్భంగా ప్రజలకు వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి బుధవారం శుభాకాంక్షలు తెలిపారు. దుర్గాదేవి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. పండగను సంతోషంగా చేసుకోవాలని కోరుకున్నారు.

⇨ **నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట):** విజయదశమి పండగ ప్రజలకు విజయాలను చేకూర్చాలని కోరుకుంటున్నట్లు వైఎస్సార్‌సీపీ నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ప్రజలకు పండగ శుభాకాంక్షలు తెలిపారు.

⇨ **నెల్లూరు(పొగతోట):** ప్రజలకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ బుధవారం విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీనివాసునికి శాంతి కల్యాణం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బుధవారం నగరంలోని వెంకటేశ్వరపురంలో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శాంతి కల్యాణ మహోత్సవం జరిగింది. మధ్యాహ్నం భక్తులకు అన్న సంతర్పణ చేశారు. సాయంత్రం స్వామి శ్రీమన్నారాయణ అలంకారంలో దర్శనమిచ్చారు. అనంతరం మౌనిక, వరలక్ష్మి డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్ వారి భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు సాయిభరద్వాజ, కమిటీ చైర్మన్ నాగిరెడ్డి, సభ్యులు పర్యవేక్షించారు.

బీఎస్‌ఎన్‌ఎల్ సిల్వర్ జూబ్లీ వేడుకలు


బీఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగుల ర్యాలీ

నెల్లూరు రూరల్: మొబైల్ రంగంలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం బీఎస్ఎన్ఎల్ అధికారులు వేడుకలు నిర్వహించారు. డీజీఎం శ్రీనివాసరావు మాట్లాడారు. 5జీకి సంబంధించి జిల్లాలో 112 సెల్ టవర్లను గుర్తించామని త్వరలో, ఆ పని ప్రారంభిస్తామన్నారు. బీఎస్ఎన్ఎల్ కార్యాలయం నుంచి గాంధీబొమ్మ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏజీఎం సేల్స్ రామ్మోహన్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో వ్యక్తి మృతి


మదన్ మృతదేహం

నెల్లూరు(క్రైమ్): గుండెపోటో?, మరే ఇతర కారణమో స్పష్టంగా తెలియదు గానీ ఓ వ్యక్తి నెల్లూరులోని ఆర్టీసీ బస్టాండ్‌లో మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. తమిళనాడుకు చెందిన మదన్‌కుమార్ (40) కేరళలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. వారణాసికి వెళుతున్నానని అక్కడి నుంచి బయలుదేరిన అతను నెల్లూరుకు వచ్చాడు. గతనెల 14వ తేదీ నుంచి బృందావనంలోని ఓ లాడ్జీలో ఉంటూ మద్యం తాగుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం మదన్ ఊరు వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చాడు. తిరుపతి నాన్‌స్టాప్ కేంద్రం సమీపంలోని దిమ్మెపై కూర్చొని అక్కడ కుప్పకూలిపోయాడు. ఈ విషయాన్ని గమనించిన అక్కడున్న వారు 108కు సమాచారం అందించారు. అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి కళ్లు, నుదిటిపై నల్లటి మచ్చలున్నాయి. ఆర్టీసీ డిపో కంట్రోలర్ రమణయ్య చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. మృతుడికి ఇటీవల యాక్సిడెంట్ జరిగిందని, అందువల్లే కళ్లు, నుదిటిపై నల్లమచ్చలు ఏర్పడ్డాయని లాడ్జీ వద్దగల కొందరు పోలీసులకు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

దుర్గమ్మా.. పాహిమాం


కన్యకాపరమేశ్వరి ఆలయంలో అలంకరణ


ఉమామహేశ్వర ఆలయంలో మహిషాసురమర్దినిగా..


విరాట్‌నగర్ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో అన్నపూర్ణ అలంకారం


రాజరాజేశ్వరి ఆలయానికి వచ్చిన భక్తులు

శరన్నవరాత్రి ఉత్సవాలు నెల్లూరు నగరంలో వైభవంగా జరుగుతున్నాయి. 10వ రోజు బుధవారం జగన్మాత మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులను కటాక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయ దశమి పండగను ప్రజలు గురువారం భక్తి ప్రపత్తులతో సంబరంగా జరుపుకోనున్నారు.
– నెల్లూరు(బృందావనం)


నవాబుపేట కామిశెట్టివారి మహాలక్ష్మి ఆలయంలో..


బాలాజీనగర్ సీతారామస్వామి మందిరంలో మహాకాళిగా..


శ్రీకృష్ణధర్మరాజ స్వామి దేవస్థానంలో..

పెనుబర్తిలో రైతులకు అవగాహన


ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు

నెల్లూరు సిటీ: వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ 12 నుంచి 5 శాతానికి తగ్గినట్లుగా మండల వ్యవసాయాధికారి నాగమోహన్ పేర్కొన్నారు. రూరల్ మండలంలోని పెనుబర్తి గ్రామంలో బుధవారం సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు షర్మిల, శివకుమార్ సుదీప్న, రైతులు పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేయండి


నియామకపత్రాలు అందుకున్న వారితో కలెక్టర్

నెల్లూరు రూరల్: డీఎస్సీ 2025లో ఉద్యోగాలు సాధించిన వారు నిబద్ధతతో పనిచేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. బీసీ స్టడీ సర్కిల్‌లో ప్రభుత్వం అందించిన కోచింగ్‌ను సద్వినియోగం చేసుకుని కొలువులు సాధించిన అభ్యర్థులను బుధవారం కలెక్టరేట్‌లో ఆయన అభినందించారు. నియామకపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. సుమారు 300 మందికి పైగా అభ్యర్థులకు శిక్షణ ఇవ్వగా 20 మంది ఉద్యోగాలు పొందారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారిణి వెంకటలక్ష్మమ్మ, స్టడీ సర్కిల్ కో ఆర్డినేటర్ వంశీకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద రక్తదానాన్ని ప్రోత్సహిద్దాం



రక్తదానం చేస్తున్న దాతలు

నెల్లూరు(అర్బన్): ఆపదలో ఉన్న క్షతగాత్రులను ఆదుకునేందుకు, ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులను ఆదుకునేందుకు దాతలు రక్తదానం చేయాలని ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి అన్నారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మద్రాస్ బస్టాండ్ పక్కనున్న రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్‌లో స్వచ్ఛంద రక్తదాతలైన బి.సురేంద్రనాథ్, సాయిరాజేష్, మక్కెన అంకయ్య చౌదరి తదితరులు రక్తదానం చేశారు. ఎంసీ మెంబర్ యాలమూరి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ



పండ్లు అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు


వృద్ధులకు సన్మానం

నెల్లూరు(అర్బన్): కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, మైభారత్ నెల్లూరు ఆధ్వర్యంలో బుధవారం 25వ డివిజన్ బుజబుజనెల్లూరులోని వృద్ధుల ఆశ్రమంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. మాధవ్ డయాబెటిస్ కేర్ సెంటర్ సహకారంతో వృద్ధులకు ఉచితంగా వైద్యపరీక్షలు, రక్తపరీక్షలు చేసి మందులు అందించారు. పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి ఆకుల మహేంద్ర రెడ్డి, పీఎంపీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, దేవరకొండ శ్రీనివాసులు, విశ్రాంత ఏఎస్ఐ మహబూబ్‌బాషా, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రసూల్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

⇨ **నెల్లూరు(వీఆర్సీసెంటర్):** వెంకటేశ్వరపురంలోని వికలాంగుల ఐక్య సంఘం ఆధ్వర్యంలో వృద్ధులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సనావుల్లా, బ్లాక్ బోర్డు మిత్రమండలి అధ్యక్షుడు ప్రసాద్, జక్కావుల్లా, ఆలియా, వెంకన్న, సుభానీ, ఆబిద్ పాల్గొన్నారు.

నారాయణలో ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు


వాల్‌పోస్టర్లను ప్రదర్శిస్తున్న డాక్టర్లు

నెల్లూరు(అర్బన్): రొమ్ము కేన్సర్ అవగాహన మాసం సందర్భంగా 30 సంవత్సరాల వయసు పైబడిన స్త్రీలకు నారాయణ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నామని అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రావులపల్లి హరీష్ తెలిపారు. బుధవారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైద్యులు మనోభిరామ్, శ్రీవిద్యతో కలిసి హరీష్ మాట్లాడారు. మామోగ్రామ్, పాప్‌స్మియర్, సీబీపీ, చెస్ట్ ఎక్స్‌రే పరీక్షలు ఉచితంగా చేస్తామన్నారు. కేన్సర్ వైద్యనిపుణులు సూచించే ఇతర పరీక్షలకు రాయితీ ఇస్తామన్నారు. ఉచిత పరీక్షలను ఈనెలాఖరు వరకు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ రేడియేషన్ అంకాలజిస్ట్ డాక్టర్ గురుసాయి రత్నప్రియ, హాస్పిటల్ ఏజీఎం ఏసీ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భరతనాట్య ప్రదర్శన నేడు

నెల్లూరు(బృందావనం): వేదాయపాళెం త్యాగరాజ నగర్‌లోని త్యాగరాజస్వామి మందిరంలో గురువారం విజయ నృత్యాంజలి భరతనాట్య ప్రదర్శన జరుగనుందని నిర్వాహకులు ఎనమండ్ర నాగదేవిప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బెంగళూరుకు చెందిన ప్రముఖ నృత్య కళాకారిణి గురు విదూషి చిత్ర అరవింద్ శిష్య బృందం ఆధ్వర్యంలో సాయంత్రం 6:30 గంటలకు జరిగే ఈ ప్రదర్శనను జయప్రదం చేయాలని కోరారు.

పార్కులను అందుబాటులోకి తీసుకురావాలి

• కమిషనర్ వైఓ. నందన్


ఎస్వీజీఎస్ కళాశాల సమీపంలో కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు): 'పార్కుల్లో మౌలిక వసతులు కల్పించాలి. నిర్దేశించిన సమయంలోపు వాటిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి' అని నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ. నందన్ అధికారులను ఆదేశించారు. స్థానిక 13వ డివిజన్ పాత మిట్టపాళెం, యనమలవారిదిన్నె, బలిజపాళెం ప్రాంతాల్లోని ప్రజా పార్కుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను కమిషనర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆ డివిజన్‌లోని బలిజపాళెం ప్రాంతంలో ఎన్టీఆర్ సామాజిక భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు. అన్ని డివిజన్లలో వార్డు సచివాలయ కార్యదర్శులు లబ్ధిదారుల ఇంటికెళ్లి పెన్షన్లు వంద శాతం పంపిణీ చేయాలని ఆదేశించారు. అనంతరం ఎస్వీజీఎస్ కళాశాల సమీపంలో మురుగునీటి కాలువలో వ్యర్థాలను తొలగించే ఎక్సవేటర్ మెషీన్ పనితీరును ఇంజినీరింగ్ విభాగాధికారులతో కలిసి పరిశీలించారు. మైపాడురోడ్డులోని జలపుష్ప భవన్ ఫిష్‌మార్కెట్ ప్రాంగణాన్ని తనిఖీ చేసి మార్కెట్లో మౌలిక వసతులను చూశారు. పనులను నిర్దేశించిన సమయంలోపు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అక్కడి నుంచి మైపాడుగేట్ సెంటర్, జాఫర్‌సాహెబ్ కెనాల్ ప్రాంతంలో జరుగుతున్న స్మార్ట్ స్ట్రీట్ బజార్ ప్రాజెక్ట్ చివరిదశ పనులను కమిషనర్ పర్యవేక్షించారు. అనంతరం మూలాపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నిర్మాణ పనులను చూశారు. అక్కడి కూడలి ప్రాంతంలోని శ్రీపొట్టి శ్రీరాములు విగ్రహం ఐలాండ్ ప్రాంతాన్ని సందర్శించి, ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఐలాండ్ చుట్టుపక్కల ఆక్రమణలు గురికాకుండా, రోడ్డు వెంబడి ఎలాంటి దుకాణాలను ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్, పబ్లిక్ హెల్త్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజలకు వివరించండి

నెల్లూరు(పొగతోట): జీఎస్టీ మార్పులపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని జెడ్పీ సీఈఓ మోహన్‌రావు ఆదేశించారు. బుధవారం జెడ్పీ కార్యాలయం నుంచి వివిధ మండలాల అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జీఎస్టీకి సంబంధించిన వివరాలను సక్రమంగా అప్‌లోడ్ చేయాలన్నారు. సీనియర్ సిటిజన్లకు అవగాహన కల్పించాలని తెలిపారు.

ఆగని చోరీలు.. రైతులకు తిప్పలు

పొదలకూరు: గ్రామీణ ప్రాంతాల్లో నిమ్మతోటలు, ఇతర పంటల సాగుపై పశువులు, అడవి పందులు పడి ధ్వంసం చేయకుండా రైతులు సోలార్ ఫెన్సింగ్ నిర్మాణం చేసుకుంటారు. వీటికి అన్నిరకాల అనుమతులు ఉంటాయి. అధికారులే సోలార్ ఫెన్సింగ్ నిర్మాణం చేపట్టి పంటలను రక్షించుకోవాల్సిందిగా వెల్లడిస్తుంటారు. ఇలాంటి ఫెన్సింగ్ వల్ల పశువులు, మనుషులకు ఎలాంటి ప్రాణహానీ ఉండదు. కేవలం పంటలను రక్షించుకునేందుకు దాదాపుగా నిమ్మతోటలు ఉన్న ప్రతి రైతు ఏర్పాటు చేసుకుంటారు. అయితే ఇటీవల సోలార్ ఫెన్సింగ్‌కు సంబంధించిన ప్యానెల్, బ్యాటరీలను దొంగలు తస్కరిస్తున్నారు. చిల్లర దొంగతనాలకు అలవాటు పడిన వారు గ్రామ సమీపాల్లో నిమ్మతోటలు, ఇతర పంటలకు ఏర్పాటు చేసుకునే ఫెన్సింగ్ బ్యాటరీలను చోరీ చేసి అమ్ముకుంటున్నారు. దీంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

ఫెన్సింగ్‌కు రూ.15 వేల ఖర్చు

సుమారు ఐదెకరాల తోటకు సోలార్ ఫెన్సింగ్ నిర్మించుకునేందుకు రైతులకు రూ.15 వేల వరకు ఖర్చవుతుంది. సోలార్ ప్యానెల్, బ్యాటరీ, ఫెన్సింగ్ తీగలను కొనుగోలు చేసి బిగించుకుంటారు. అయితే దొంగలు, వ్యసనాలకు అలవాటు పడిన వారు బ్యాటరీ, ప్యానెల్‌ను తస్కరించి రూ.2 వేలకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోలార్‌తోపాటు విద్యుత్ మోటార్ల స్టార్టర్లను సైతం అపహరిస్తున్నారు. ఇటీవల మొగళ్లూరు, అంకుపల్లి, దేగపూడి తదితర గ్రామాల్లో తోటల్లో ఏర్పాటు చేసిన సోలార్ ఫెన్సింగ్ బ్యాటరీలు చోరీకు గురయ్యాయి. దీంతో రైతులు అల్లాడిపోతూ నగదు ఖర్చుతోపాటు తిరిగి ఏర్పాటు చేసుకోవడం ఇబ్బందిగా మారుతున్నట్లు వాపోతున్నారు.

చాలాకాలం నుంచి..

ఎప్పటి నుంచో మండల పరిధిలో విద్యుత్ మోటార్లు, వాటి స్టార్టర్లు చోరీలకు గురవుతూనే ఉన్నాయి. మోటారు వైరును కూడా వదలకుండా కత్తిరించుకుని వెళ్తున్నారు. ఫలితంగా రైతులు తీవ్ర సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తోంది. గతంలో ఇలాంటి నేరాలకు సంబంధించి పోలీసులు కొందరిని అరెస్ట్ చేసినా తరచుగా దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. ఇటీవల మొగళ్లూరు తోట షెడ్డులో పాత మోటార్లు ఉండగా రెండింటిని తస్కరించిన చోరులు పొదలకూరులో అమ్ముకున్నట్టు తెలిసింది. బాధితులు పోలీసులకు సైతం ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. చిల్లర నేరగాళ్లను అరికట్టకుంటే తోటల్లో మోటార్లు, ఫెన్సింగ్‌కు రక్షణ లేకుండాపోతుందని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

తాగునీటి సమస్యపై కలెక్టర్‌కు వినతి


కలెక్టర్‌ను కలిసిన నేతలు

నెల్లూరు రూరల్: ఏఎస్‌పేట మండలంలోని గుడిపాడు గ్రామంలో ఎస్టీ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గిరిజన సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు పాలకీర్తి రవి, ఉపాధ్యక్షుడు సముద్రాల దావీదు, మహిళా విభాగం అధ్యక్షురాలు చెల్లా మాధవి కోరారు. వారు బుధవారం కలెక్టర్ హిమాన్షు శుక్లాను కలెక్టరేట్‌లో కలిసి విన్నవించారు. స్పందించిన కలెక్టర్ నీళ్ల ట్యాంక్ ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అరవ కామాక్షి, గురునాథం రవి, షేక్ సంధాని, షేక్ రజియా, షేక్ రఫీ తదితరులు పాల్గొన్నారు.